క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ



కంకిపాడు: కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి అన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి వితరణతో పలు కుటుంబాలకు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. చలివేంద్రపాలెం గ్రామానికి చెందిన షేక్ హన్ను ప్రమాదానికి గురై కాలు ఫ్రాక్చర్ కావటంతో హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. క్రిస్టియన్‌పేటకు చెందిన తానుచింతల చిన ఆదాం ఇటీవల మృతి చెందటంతో బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నేత నక్కా శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పిన్నబోయిన శ్రీనివాసరావు, బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, చోరగుడి మహేష్, మాదు రాఘవేంద్రరావు, బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, కొండా రామిరెడ్డి, మరీదు శివశంకర్, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



ఉయ్యూరు: అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిస్సి గ్రేస్ సూచించారు. ఉయ్యూరు మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితా ప్రకారం గురువారం రైతులు ఈకేవైసీ చేయించుకుంటున్నారు. ఈ ప్రక్రియను వ్యవసాయాధికారి నిస్సిగ్రేస్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే పథకం వర్తిస్తుందన్నారు. రైతులు ఆధార్‌కార్డు తీసుకువెళ్లి రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

గన్నవరంలో 8, 9 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



గన్నవరం: సీపీఐ 26వ కృష్ణాజిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మహాసభల ఆహ్వాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. ఉద్యమాల పురిటిగడ్డ గన్నవరంలో జూలై 8, 9 తేదీల్లో జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆగస్టులో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లో సెప్టెంబర్‌లో జాతీయ మహాసభలు జరుగుతాయన్నారు. జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీ నాయకులు అడ్డాడ ప్రసాద్, పెద్దు వాసుదేవరావు, వెంకటరత్నం, ముక్కామల ఉమామహేశ్వరరావు, కేఆర్సీ జోషి, సుబ్బారెడ్డి, శోభనచలపతిరావు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యతిరేక ర్యాలీ



కంకిపాడు: కంకిపాడు బచ్చుపేట ఏరియాలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. విజయవాడ నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో చిన్నారులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. బడి ఈడు పిల్లలు పాఠశాలలకు వెళ్లాలని, పనికి కాదని నినాదాలు చేశారు. ర్యాలీని డాన్ బాస్కో లెర్నింగ్ సెంటర్ ఉపాధ్యాయురాలు ఎం.పెద్దింట్లమ్మ పర్యవేక్షించారు.

మెకానిక్‌ల అభివృద్ధే ధ్యేయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): అమరావతి కారు మెకానిక్స్ అసోసియేషన్ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్టు ఆ సంఘ అధ్యక్షుడు టీఎస్ దివాకర్ అన్నారు. గురువారం ఆటోనగర్‌లోని ఓ హోటల్‌లో అమరావతి కారు మెకానిక్స్ అసోసియేషన్ పాలకవర్గ సమావేశం జరిగింది. దివాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ జూలై 11న అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆ రోజునే 10 తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సభ్యుల పిల్లలకు ఆర్థిక సాయం అందించనున్నట్టు తెలిపారు. సంఘ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, కోశాధికారి జి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పచ్చ బంగారం సాగుకు శ్రీకారం

- పొలాలు అదునుకు రావటంతో సాగు పనులు చేపట్టిన రైతులు
- విత్తనం కొమ్ము సేకరణపై దృష్టి
- తొలకరి పలకరింపుతో సాగులో నిమగ్నం





పసుపు విత్తనం కొమ్ములు విరుస్తున్న కూలీలు
పొలంలో నాటేందుకు సిద్ధంగా ఉన్న పసుపు విత్తనం(ఇన్‌సెట్)

కంకిపాడు: పచ్చబంగారం (పసుపు పంట) సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. తొలకరి పలకరింపుతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. పసుపు విత్తనం కొమ్ములు విరిచి, పొలంలో నాటేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం ఈ ప్రాంతానికి అనువైన విత్తన రకాన్ని ఎంపిక చేసుకోవటంపై రైతులు దృష్టి పెడుతున్నారు.

వాణిజ్య పంటల్లో పసుపు పంట కూడా ముఖ్యమైంది. కృష్ణాజిల్లాలో 5,031 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 707 ఎకరాల్లో పసుపు సాగుకు అనువైన భూములు ఉన్నాయి. సాధారణంగా కడప, మైదుకూరు, ప్రగతి, శీలం, ఎర్రశీలం, స్థానిక రకాలను రైతులు సాగుకు ఎంపిక చేసుకుంటారు. మేలైన దిగుబడులు, తెగుళ్ల బెడద తక్కువగా ఉండే విత్తన రకాలకు రైతులు ప్రాధాన్యం ఇస్తారు.

ముందుగానే పలకరించిన తొలకరి

ఈ ఏడాది తొలకరి ముందుగానే పలకరించింది. అడపాదడపా ఓ మోస్తరు వర్షాలు కురవటంతో భూములు అదునుకు వచ్చాయి. దీంతో రైతులు పొలాల్లో పూర్వ పంట తాలూకా వ్యర్థాలను ఏరివేసి, రెండు దఫాలుగా దుక్కి దున్ని పసుపు విత్తనం నాటేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. పెనమలూరు, పామర్రు నియోజకవర్గాలతో పాటుగా దివిసీమ పరిధిలోని లంక భూముల్లో పసుపు సాగు చేపట్టేందుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. ఈ క్రమంలో అనువైన విత్తనాలను సేకరించే పనిలో పడ్డారు. ఇప్పటికే ఎకరం కౌలు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకూ ఒప్పందాలు చేసుకుని సాగుపై దృష్టి పెడుతున్నారు.

పుట్టు రూ.5,500 నుంచి రూ.6,500

రెండేళ్ల కిందటి వరకు పుట్టు(225 కిలోలు) ధర రూ.3,500 మించి పలికేది కాదు. ఈ ఏడాది రూ.5,500 నుంచి రూ.6,500 పలుకుతోంది. పసుపు పంట చేతికి వచ్చే నాటికి ఫిబ్రవరి, మార్చి మాసంలో పచ్చి పసుపు కొమ్ములు పుట్టు రూ.3 వేల నుంచి రూ.4 వేల లోపే మార్కెట్‌లో ధర పలికింది. అలాంటిది ప్రస్తుతం రైతులు విత్తనం కోసం కొనుగోలు చేసే నాటికి ఆ ధర పెరుగుతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. అమ్మబోతే అడవి... కొనబోతే కొరివి అన్న చందంగా తయారవుతోందంటూ ఆవేదన వెల్లబుచ్చుతున్నారు. అయినా చేసేదేమీ లేక సాగుకు అవసరమైన విత్తనం కొమ్ము ధర పెచ్చు అయినా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ధర ఇంకా పెరిగే అవకాశం

ఎండుకొమ్ములు ధర రూ.9,500 నుంచి రూ.11500 మధ్య నడుస్తోంది. గతేడాదితో పోలిస్తే రూ.14 వేలు మార్కు దాటుతుందని రైతులు ఆశించారు. అయినా ఆశించిన మేరకు ధర పెరగలేదు. అయితే ఈ దఫా రేటు పెరుగుతుందనే ఆశాభావంతో ఉన్నారు. దీంతో విత్తనం కొమ్ము సేకరించి సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. మరో పది రోజులు దాటితే విత్తనం కొమ్ముకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. ధర పెరిగే ఛాన్స్ ఉండటంతో ముందస్తుగానే విత్తనం సేకరించి నిల్వ చేసుకుని సాగుకు ఉపక్రమించేలా సన్నద్ధమవుతున్నారు.

భారం అయినా తప్పదు



పచ్చి కొమ్ములు పుట్టు రూ.4 వేల లోపే పలికింది. అదే నేను విత్తనం కొనేసరికి పుట్టు రూ.5,500 దాటింది. ఇంకా పెరుగుతుందని చెబుతున్నారు. సాగు మొదట్లోనే విత్తనం ఖర్చు భారం అవుతోంది. అయినా సాగుకు విత్తనం అవసరం కాబట్టి తప్పదు. ఈ ఏడాది పసుపు మార్కెట్ కొంత నిరాశ పరిచింది. ఈ దఫా అయినా మంచి ధర మార్కెట్‌లో దక్కుతుందనే ఆశతో సాగు చేపడుతున్నాం.

–లుక్కా వెంకటేశ్వరరావు, కౌలురైతు, రొయ్యూరు

ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ప్రభుత్వ శాఖల వారీగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా గన్నవరం–నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పేరుతో రెండు నెలలు క్రితం ఆక్రమణలు తొలగించారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ, విస్తరణ పనుల నిమిత్తం మట్టి తవ్వి వదిలివేయడం వల్ల వ్యాపారులు ఇబ్బందులు, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్ల నిర్మాణంతో పాటు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు.

వెలవెలబోయిన సమావేశ ప్రాంగణం

గన్నవరం, బుద్దవరం, కేసరపల్లి గ్రామాల్లో చెత్త తరలింపు నిమిత్తం కొనుగోలు చేసిన వాహనం మరమ్మతులకు గురై 10 రోజులుగా షెడ్డులో ఉన్న అధికారులు పట్టించుకోకపోవడంపై సభ్యులు సీరియస్ అయ్యారు. దీనివల్ల మూడు గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. సదరు వాహనం మెయింటినెన్స్ కోసం వెంటనే ఓ కమిటీని నియమించాలని ఎంపీడీఓ టి.స్వర్ణలతకు సూచించారు. అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు ఎక్కువ మంది రాకపోవడంతో సమావేశ ప్రాంగణం వెలవెలబోయింది. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ–2 కాలగడ్డ శివనాగరాజకుమారి పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథుడి స్నాన పౌర్ణమి మహోత్సవం

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక 16వ డివిజన్‌లో పాత వీబీఎం కాలేజీ ఆవరణలోని ఇస్కాన్ మందిరంలో వేంచేసి ఉన్న జగన్నాథ స్వామి స్నాన పౌర్ణమి మహోత్సవం గురువారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. కనులపండువగా జరిగే ఉత్సవం ఏటా జ్యేష్ఠ పౌర్ణమి రోజున నిర్వహిస్తారు. ఈ రోజు జగన్నాథుడి ఆవిర్భావతిథిగా పరిగణిస్తారని ఇస్కాన్ మందిర నిర్వాహకులు చెబుతున్నారు. జగన్నాథునికి బలభద్రుడికి, సుభద్రకు, సుదర్శన్‌కు 26 నదుల పవిత్ర జలాలు.. పంచామృతాలతో చక్కగా స్నానం చేశారు. ఈ ఉత్సవం తర్వాత స్వామివారి మూలవిరాట్‌లు ఒక ప్రత్యేక గదిలో 14 రోజులపాటు విశ్రాంతిలో ఉంటారని మందిర నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిర పీఆర్‌ఓ శ్యాంసుందర్ అచ్యుత దాస్, భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసాలు



కానూరులో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో బేబీసుకన్య



గండిగుంటలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు



పెదపులిపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనమలూరు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రైమరీ విద్యా బోధన చేస్తామని ఐసీడీఎస్ సీడీపీవో బేబీసుకన్య అన్నారు. కానూరు గ్రామంలో గురువారం సామాజిక అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా బేబీసుకన్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రైమరీ విద్యాబోధన, ఆటపాటలు, పౌష్టికాహారం అందజేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను తల్లులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు. పెదపులిపాక గ్రామంలో సూపర్‌వైజర్ కల్యాణి వర్మ అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. పెనమలూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం చేశారు. గ్రామ ఉపసర్పంచ్ సుమతి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీడీపీవో బేబీసుకన్య, సూపర్‌వైజర్ కె.శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వణుకూరు, గోసాల, గంగూరు గ్రామాల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడుతూ మూడేళ్ల పైబడిన చిన్నారులకు ఆడుతూ పాడుతూ చదువు చెబుతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరంలో..

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీడీఓ టి.స్వర్ణలత, సీడీపీఓ మంగమ్మ చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, శాంతి కిశోర్, ఎంఈఓ కొండా రవికుమార్, ఎంఈఓ–2 కమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య

ఉంగుటూరు(గన్నవరం): మండల కేంద్రమైన ఉంగుటూరులోని స్త్రీశక్తి భవనంలో గురువారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల్లో కొత్తగా చేరిన చిన్నారులకు ఎంపీపీ వడ్లమూడి సరోజిని చేతుల మీదుగా సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈవోపీఆర్డీ దిలీప్‌కుమార్, సర్పంచ్ కాటూరి వరప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.దుర్గాదేవి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవికి పూజలు..

ఉయ్యూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు గురువారం నిర్వహించారు. మండలంలోని గండిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఎంపీడీఓ జీఎస్‌వీ శేషగిరిరావు అక్షరాలు దిద్దించారు. చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించి అక్షరాభ్యాసం చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని పాల్గొన్నారు. ఉయ్యూరు పట్టణంతో పాటుగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు.



ఉంగుటూరులో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీపీ సరోజిని



గోసాలలో..

చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలి



కంకిపాడులో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీడీఓ అనూష, ఐసీడీఎస్ సిబ్బంది

కంకిపాడు: చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంపీడీఓ పి.అనూష సూచించారు. ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సామూహిక అక్షరాభ్యాసం గురువారం నిర్వహించారు. మూడేళ్లు నిండిన పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఎంపీడీఓ అనూష మాట్లాడుతూ.. ఆట పాటలతో కూడిన విద్యతోనే చిన్నారుల్లో మనో వికాసం కలుగుతుందన్నారు. మేథోసంపత్తి వికసిస్తుందన్నారు. కార్యాలయ ఏఓ బసవయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి, షేక్ రెహానాబేగం, ఐసీడీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారుల అత్యుత్సాహం..

అయితే ఐసీడీఎస్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినబడుతున్నాయి. అధికారికంగా నిర్వహించే కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి గౌరవం, ప్రాధాన్యత ఇవ్వటం లేదని తెలుస్తోంది. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా, ప్రొటోకాల్ పాటించకుండా అధికార పార్టీ నేతలకు ప్రాధాన్యం ఇస్తూ, వారికి వత్తాసుగా నిలుస్తున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఎట్టకేలకు గ్రామకంఠం స్వాధీనం



గ్రామకంఠం భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన పంచాయతీ సిబ్బంది

ఉయ్యూరు: మండలంలోని గండిగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ కంఠం భూమిని పంచాయతీ అధికారులు ఎట్టకేలకు స్వాధీనం చేసుకున్నారు. గ్రామం నడిబొడ్డున ఉన్న సుమారు 10 సెంట్ల గ్రామకంఠం భూమి గ్రామ పంచాయతీకి చెందినదంటూ గురువారం పంచాయతీ కార్యదర్శి కూర్మారావు పంచాయతీ సిబ్బందితో కలిసి బోర్డు ఏర్పాటుచేశారు. పంచాయతీ ఇచ్చిన నోటీసుపై షాయోజిరావు స్పందించారు. గ్రామ కంఠానికి సంబంధించిన ఇంటి పన్నును రద్దు చేయమని, గతంలో యథావిధిగా ఉన్న తమ ఇంటికి సంబంధించిన హక్కుదారుల పేర్లు కొనసాగించాలని లిఖితపూర్వకంగా కార్యదర్శికి వివరణ ఇచ్చారు. కాగా గ్రామ కంఠం అన్యాక్రాంతం విషయంలో వివరణలు, రద్దుతో సరిపెట్టకుండా అక్రమాలకు పాల్పడిన బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం వస్తేనే.. చెత్త కుప్పల తొలగింపు



పోరంకిలో ప్రధాన రహదారి వెంబడి చెత్త తొలగిస్తున్న సిబ్బంది

పెనమలూరు: స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర అంటూ తాడిగడప మున్సిపాలిటీలో తరచుగా ర్యాలీలు చేస్తూ.. ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పే మున్సిపాలిటీ అధికారులు డొల్లతనం సీఎం చంద్రబాబు పర్యటనలో బట్టబయలైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోరంకిలో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనటానికి వస్తున్నారన్న సమాచారంతో ఒక్కసారిగా మున్సిపాలిటీ అధికారులు ఉలిక్కిపడ్డారు. ఆగమేఘాల మీద రహదారుల పక్కన చాలా రోజులుగా పేరుకుపోయిన చెత్తకుప్పలు తొలగించటానికి పరుగులు తీశారు.

చెత్తకుప్పలకు మోక్షం..

కానూరు, పోరంకి ప్రాంతాల్లో టన్నుల కొద్దీ చెత్త ఉండటంతో జేసీబీలు తీసుకు వచ్చి ట్రాక్టర్లలో చెత్త తరలించారు. చెత్త కుప్పలతో ఇబ్బందులు పడుతున్నామని మున్సిపాలిటీ ప్రజలు మొరపెట్టుకున్నా ఇంతకాలం పట్టించుకునే నాథుడే కనబడలేదు. చంద్రబాబునాయుడి పర్యటనతో చెత్త కుప్పలకు మోక్షం వచ్చింది. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర అమలు డొల్లగా ఉందని చంద్రబాబు పర్యటనతో తేటతెల్లమైంది.

తెంపల్లిలో మలేరియా నివారణ ర్యాలీ



తెంపల్లిలో ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ కరిముల్లా, ఆరోగ్య సిబ్బంది

గన్నవరంరూరల్: మలేరియా వ్యతిరేక పోరాటాన్ని అందరూ విజయవంతం చేయాలని ఆత్కూరు పీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ కరిముల్లా పిలుపునిచ్చారు. తెంపల్లి మలేరియా వ్యతిరేక మాసోత్సవం ర్యాలీని ఆరోగ్య సిబ్బంది గురువారం నిర్వహించారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జరిగే మాసోత్సవంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా అంతం మనతోనే సాధ్యమని చెప్పారు. సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటరాజు రాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సాంబశివరావు, ఎంఎల్‌హెచ్‌పీ అంకమ్మ, ఏఎన్‌ఎంలు మంజుల, విమల, ఆశా వర్కర్లు దుర్గా, మేరీ, శకుంతల పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలని నిరసన



మాదలవారిగూడెంలో నిరసన తెలియజేస్తున్న నాయకులు, కూలీలు

గన్నవరంరూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యాన గురువారం ధర్నా, నిరసన కార్యక్రమం జరిగింది. మండలంలోని మాదలవారి గూడెం పంచాయతీ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలతో కలిసి సీపీఎం నాయకులు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా వందలాది మంది కూలీలు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వాలకు కార్మికుల బాధలు పట్టడం లేదని సీపీఎం నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి విమర్శించారు. వేతనాలు వెంటనే విడుదల చేయాలని, లేకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. లంక మరియదాస్, కైలే ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



కేసరపల్లిలో అడ్మిషన్ పత్రం అందజేస్తున్న డీవైఈఓ రవికుమార్



పాఠ్యపుస్తకాలతో ఎలిమెంటరీ విద్యార్థులు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుడివాడ డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 55 పాఠశాలలో చదువుతున్న 4,780 మంది విద్యార్థులకు టెక్స్, నోట్ బుక్స్, యూనిఫాం, డిక్షనరీస్, బెల్టులు అందజేశామన్నారు. ఇంకా ఈ కిట్‌లోని షూస్, బ్యాగ్‌లు రావాల్సి ఉందన్నారు. అనంతరం ఎంపీపీ పాఠశాలలో నూతనంగా చేరే విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను అందజేశారు. ఎంఈఓ–2 కమల, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో 8 వేల మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశామని మండల విద్యాశాఖాధికారి ఎ.సూరిబాబు తెలిపారు. 1,2 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, 3, 4, 5 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ పాఠ్య పుస్తకాలను అందచేశారు. హైస్కూల్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను అందజేసినట్లు మండల విద్యాశాఖాధికారి చెప్పారు.

జంక్షన్‌లో కిట్ల అందజేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలంలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను గురువారం పంపిణీ చేశారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్, ఎంపీపీ యర్రగొర్ల నగేష్ కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం అందజేశారు. మండలంలోని 3,838 మంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ యడవల్లి శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం ముత్తేవి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఎంసీకి వసీం బేగ్

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్(టీపీఎస్)గా వసీం బేగ్ బదిలీపై వచ్చారు. నందిగామ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న బేగ్‌ను సాధారణ బదిలీల్లో భాగంగా గురువారం విజయవాడకు బదిలీ చేస్తూ టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత ఉత్తర్వులు జారీ చేశారు. వసీంబేగ్ గతంలో వీఎంసీలో టీపీవోగా విధులు నిర్వహించారు.